# నేడు 'రామన్న' రాక

- షాద్‌నగర్ నియోజకవర్గంలో మంత్రి కేటీఆర్ పర్యటన
- రూ.270 కోట్ల పనులకు ప్రారంభోత్సవాలు
- హాజరుకానున్న మంత్రులు సబితారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు
- షాద్‌నగర్ మార్కెట్ యార్డులో భారీ బహిరంగ సభ
- ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, బీఆర్ఎస్ శ్రేణులు



రంగారెడ్డి, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ గురువారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. షాద్‌నగర్ పట్టణంలో, కొత్తూరులో డబుల్ బెడ్రూం ఇండ్లకు ప్రారంభోత్సవం చేయడంతోపాటు, కొత్తూరులో మున్సిపాలిటీ నూతన భవనాన్ని, నందిగామ మండలంలో గ్రామపంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభిస్తారు. మొత్తంగా రూ.270 కోట్ల పనులకు ప్రారంభోత్సవాలు చేస్తారు. షాద్‌నగర్‌లో రూ.కోటితో నిర్మించనున్న బంజారా భవన్‌కు శంకుస్థాపన చేయనున్నారు. మంత్రులు సబితారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్‌రెడ్డితోపాటు జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతున్నారు. షాద్‌నగర్ మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ పాల్గొంటారు. ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

### బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు

షాద్‌నగర్ పట్టణంలోని మార్కెట్ యార్డులో గురువారం నిర్వహిస్తున్న బహిరంగ సభకు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రి కేటీఆర్‌తోపాటు ఆయన వెంట వచ్చే నేతలకు స్వాగతం పలుకుతూ భారీ కటౌట్లను ఏర్పాటు చేశారు. దీంతో షాద్‌నగర్, కొత్తూరు, నందిగామ పరిసర ప్రాంతాలు గులాబీమయమయ్యాయి. బహిరంగ సభ విజయవంతం కోసం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, స్థానిక బీఆర్ఎస్ నేతలంతా ప్రత్యేక దృష్టి సారించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో వివిధ వర్గాల ప్రజానీకం పెద్దఎత్తున తరలివచ్చేలా ఏర్పాట్లు చేశారు. పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం అహర్నిశలు కృషిచేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి మద్దతుగా తరలిరావాలని నేతలు పిలుపునిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కేటీఆర్ పర్యటిస్తుండడంతో బీఆర్ఎస్ శ్రేణులు విజయవంతానికి అహర్నిశలు కృషిచేస్తున్నాయి.



కొత్తూరు : మంత్రి కేటీఆర్ నేడు ప్రారంభించనున్న కొత్తూరు పురపాలక కార్యాలయం విద్యుత్ కాంతులతో జిగేల్‌మంటున్నది. లోపలి భాగం ఫైవ్ స్టార్ హోటల్‌ను మైమరిపిస్తున్నది. రూ.3.5 కోట్లతో 2.5 ఎకరాల్లో ఈ భవనాన్ని నిర్మించారు.

### నూతన గ్రామపంచాయతీ భవనం ప్రారంభం

నందిగామ : మండలంలోని చాకలిగుట్టతండాలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని మంత్రి కేటీఆర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో కలిసి ప్రారంభించనున్నారు. సర్పంచ్ రాజూనాయక్ ఆధ్వర్యంలో హెలీప్యాడ్ స్థలాన్ని, ఏర్పాట్లను పోలీసులు, అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. నందిగామ నుంచి షాద్‌నగర్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించేందుకు బీఆర్ఎస్ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నారు. పాత జాతీయ రహదారిపై షాద్‌నగర్ వరకు బ్యానర్లు, బీఆర్ఎస్ జెండాలను ఏర్పాటు చేశారు.

### మంత్రి కేటీఆర్ పర్యటన షెడ్యూల్..

* 9.45 : హెచ్ఐసీసీ కొత్తగూడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరుతారు.

* 10.30 : నందిగామ వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. నందిగామ మండలంలోని చాకలిదనిగుట్టతండాలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని, అనంతరం రూ.3.50 కోట్లతో నిర్మించిన కొత్తూరు మున్సిపల్ కార్యాలయ నూతన భవనాన్ని, ఆతర్వాత రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన 60 డబుల్ బెడ్రూం ఇండ్లకు ప్రారంభోత్సవం చేస్తారు.

* 11.00 : రోడ్డు మార్గాన కొత్తూరుకు చేరుకుంటారు.

* 11.15 : షాద్‌నగర్‌కు చేరుకుని రూ.96.07 కోట్ల వ్యయంతో నిర్మించిన 1,980 డబుల్ బెడ్రూం ఇండ్లను ప్రారంభిస్తారు. అనంతరం రూ.కోటి వ్యయంతో నిర్మించనున్న బంజారా భవన్‌కు శంకుస్థాపన చేస్తారు. రూ.270 కోట్లతో నిర్మించిన షాద్‌నగర్– కొత్తూరు నాలుగు లేన్ల రహదారితోపాటు వీధి లైట్లను ప్రారంభిస్తారు.

* 11.45 : షాద్‌నగర్ మార్కెట్ యార్డులో జరుగనున్న బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు.



చాకలిగుట్టతండాలో హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న మిట్యూనాయక్

# జిల్లా ఓటర్లు 33,56,056

### పురుషుల ఓట్లే అధికం

- పురుషులు 17,38,994., స్త్రీలు 16,15,876
- శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అత్యధికంగా 6,98,154
- అత్యల్ప ఓటర్లు షాద్‌నగర్ నియోజకవర్గంలో 2,25,524
- ముసాయిదా జాబితా తర్వాత పెరిగిన కొత్త ఓటర్లు 1,56,382
- తుది జాబితాను విడుదల చేసిన ఎన్నికల సంఘం




రంగారెడ్డి, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) : రానున్న అసెంబ్లీ ఎన్నికలకు రంగారెడ్డి జిల్లా తుది ఓటరు జాబితాను బుధవారం ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ ఏడాది మే 25న విడుదలైన ఓటరు ప్రణాళిక ప్రకారం పోలింగ్ కేంద్రాల గుర్తింపు, నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటరు జాబితా సవరణను చేపట్టింది. ఆగస్టు 21న ముసాయిదా జాబితాను విడుదల చేసింది. జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, ఓటు నమోదు, తొలగింపులు, మార్పులకు దరఖాస్తులను నాలుగు నెలలపాటు స్వీకరించింది. ఈమేరకు వచ్చిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి బుధవారం తుది జాబితాను విడుదల చేశారు. రంగారెడ్డి జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో మొత్తం 33,56,056 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 17,38,994., స్త్రీలు 16,15,876 మంది ఉన్నారు. అత్యధిక ఓటర్లు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 6,98,154 ఉండగా.. అత్యల్పంగా షాద్‌నగర్ నియోజకవర్గంలో 2,25,524 మంది ఉన్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 3,369 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

### తుది జాబితా ప్రకారం నియోజకవర్గాలవారీగా ఓటర్ల వివరాలు

| నియోజకవర్గం | పోలింగ్ కేంద్రాలు | ఓటర్లు | | థర్డ్ జెండర్ | ప్రవాసులు | | సర్వీసు ఓటర్లు | | మొత్తం ఓటర్లు |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | | పురుషులు | స్త్రీలు | | పు. | స్త్రీ. | పు. | స్త్రీ. | |
| ఇబ్రహీంపట్నం | 319 | 1,57,740 | 1,52,917 | 29 | 13 | 3 | 51 | 3 | 3,10,756 |
| ఎల్బీనగర్ | 570 | 2,96,017 | 2,70,696 | 101 | 10 | 2 | 46 | 4 | 5,66,876 |
| మహేశ్వరం | 511 | 2,66,628 | 2,50,546 | 67 | 46 | 12 | 75 | 2 | 5,17,376 |
| రాజేంద్రనగర్ | 535 | 2,88,270 | 2,64,053 | 39 | 63 | 17 | 89 | 4 | 5,52,535 |
| శేరిలింగంపల్లి | 622 | 3,70,301 | 3,27,636 | 142 | 17 | 4 | 47 | 7 | 6,98,154 |
| చేవెళ్ల | 298 | 1,28,773 | 1,25,195 | 4 | 3 | 1 | 74 | 0 | 2,54,050 |
| కల్వకుర్తి | 262 | 1,17,393 | 1,13,250 | 7 | 1 | 0 | 133 | 1 | 2,30,785 |
| షాద్‌నగర్ | 252 | 1,13,872 | 1,11,583 | 15 | 0 | 0 | 53 | 1 | 2,25,524 |
| మొత్తం | 3,369 | 17,38,994 | 16,15,876 | 404 | 153 | 39 | 568 | 22 | 33,56,056 |

## చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ అమలు చేయాలి

**రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్**

**బీసీ జేఏసీ, కళాశాల కమిటీల ప్రతినిధుల విస్తృతస్థాయి సమావేశం**




కార్యక్రమంలో మాట్లాడుతున్న శుభప్రద్ పటేల్

తాండూరు, అక్టోబర్ 4: చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ డిమాండ్ చేశారు. బుధవారం తాండూరులో బీసీ జేఏసీ, కళాశాల కమిటీల ప్రతినిధుల విస్తృతస్థాయి సమావేశంలో శుభప్రద్ పటేల్ మాట్లాడుతూ.. బీసీలు సంఘటితంతో హక్కులు సాధించుకోవాలన్నారు. కొన్నేండ్లుగా కుల గణన చేపట్టక పోవడం బాధాకరమన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ చిత్తశుద్ధితో కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలన్నారు. జనాభాలో బీసీలో ఎక్కువగా ఉన్నప్పటికీ అన్నింటిలో మనకు అన్యాయం జరుగుతున్నదన్నారు. నేటి తరం సంఘటితంతో హక్కుల సాధనకు పోరాటం చేయాలని ఆయన సూచించారు.

నేషనల్ పీపుల్స్ ఫ్రంట్ చైర్మన్ వీజీఆర్ నారగోని మాట్లాడుతూ.. బీసీలు అనేక సంవత్సరాలుగా అణచివేతకు గురవుతున్నారన్నారు. ఎంతో పోరాటం చేసిన బీసీ రిజర్వేషన్లు కేవలం 25 శాతం అమలు కావడం చాలా బాధాకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు న్యాయం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నాయకులు, అధ్యాపకులు ఉన్నారు.



సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు, ప్రతినిధులు

## రైతులు జొన్న పంట వైపు మొగ్గుచూపాలి

పెద్దేముల్, అక్టోబర్ 4 : రైతులు జొన్న పంట వైపునకు మొగ్గుచూపి ఎక్కువ మొత్తంలో సాగు చేయడానికి ముందుకు రావాలని తాండూరు వ్యవసాయ పరిశోధన సంస్థ కేంద్రం శాస్త్రవేత్త శేఖర్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని హన్మాపూర్‌లో 2023 అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంలో భాగంగా యాసంగి జొన్నలో మేలైన యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు జొన్న పంటను సకాలంలో విత్తుకోవాలని, తేమను నిలుపుకొనే చిన్న చిన్న మడులు చేసుకొనే పద్ధతి, జొన్నలో ఎరువులు చీడపీడల యాజమాన్య పద్ధతిలో సాగు చేయాలన్నారు. జొన్న పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిణి స్వాతి, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరిశోధన సంస్థ కేంద్రం శాస్త్రవేత్త శేఖర్